# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 304
పేజీలు : 08 | వెల: రూ.5/-
సోమవారం
సెప్టెంబర్ 15, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




## మాజీ డీఈఓపై విచారణ జరిపించండి

- కలెక్టర్ కు ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుల ఫిర్యాదు

8లో..









# సొమ్మొకడిది సోకొకడిది

వివరాలు2లో..

- స్టడీ టూర్ పేరిట దుబారా
- సకుటుంబ సమేతంగా తరలిన నేతలు
- ఆరు రోజులు.. అరకోటి ఖర్చు
- మరో ఏడు మాసాల్లో ముగియనున్న కాలపరిమితి
- అయినా డోంట్ కేర్ అంటున్న పాలకులు
- టూర్ ముగిశాక గ్రేటర్ ను అభివృద్ధి చేస్తామంటూ డాంబికాలు
- మేయర్, కార్పొరేటర్ల తీరుపై సర్వత్రా విమర్శలు

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైసా.. పైసా కూడబెట్టి రాష్ట్రాభివృద్ధికి బాటలు వేస్తుంటే వరంగల్ మహా నగరపాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఖాళీ అయిన ఖజానాను నింపేందుకు ఆయన ప్రయత్నిస్తుంటే మేయర్ మాత్రం నగరాభివృద్ధికి ఉపయోగించాల్సిన అరకోటి నిధులను టూర్ పేరిట దుబారా చేసేందుకు నిర్ణయించారు. వర్షాలు, ముంపు ప్రాంతాలు, మరమ్మతులకు నోచుకోని రహదారులతో నగర ప్రజలు నానా తంటాలు పడుతుంటే ఇవేమీ పట్టించుకోని బల్దియా పాలకవర్గం, కార్పొరేటర్లు కుటుంబ సమేతంగా ఎంజాయ్ చేసేందుకు ఇండోర్, జైపూర్ లకు చెక్కేశారు. మేయర్ ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు వరంగల్ మహా నగరంలోని సమస్యలను మరిచి ధూం.. ధాం చేసేందుకు శ్రీకారం చుట్టారు. మరో ఏడు నెలల్లో బల్దియా పాలకవర్గం కాలపరిమితి ముగుస్తున్న సమయంలో స్టడీ టూర్ పేరిట రాష్ట్రం దాటి పోవడంపై జనం దుమ్మెత్తి పోస్తున్నారు. ఇంతకాలం ప్రజల గురించే పట్టించుకోని పాలకవర్గం ఈ ఏడు నెలల్లో ఏం పొడుస్తారని ప్రశ్నిస్తున్నారు. మేయర్ తీరుపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతున్నా డోంట్ కేర్ అన్నట్లు వ్యహరించడంపై మండిపడుతున్నారు. బల్దియాను భ్రష్టు పట్టించిన పాలకవర్గానికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడం ఖాయం అంటున్నారు. దుబారా ఖర్చులను అడ్డుకోవాల్సిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జెండా ఊపి వీరిని సాగనంపడం పట్ల నగర ప్రజలు రుసరుసలాడుతున్నారు. - వరంగల్ వాయిస్ ప్రతినిధి



## 11 దాటినా.. పత్తా లేని అధికారులు

- గ్రీవెన్స్ రోజున ఖాళీ కుర్చీలే దర్శనం
- మల్హర్ తహసీల్దార్ కార్యాలయంలో ఇష్టారాజ్యం

8లో..

## జర్నలిస్టుల నిరసన

- ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ పై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్





2లో..

## సిగ్గు, శరం ఉంటే కడియం రాజీనామా చేయాలి

- బీఆర్ఎస్ నేత దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్

# సొమ్మొకడిది.. సోకొకడిది!



- స్టడీ టూర్ పేరిట దుబారా
- సకుటుంబ సమేతంగా తరలిన నేతలు
- ఆరు రోజులు.. అరకోటి ఖర్చు
- మరో ఏడు మాసాల్లో ముగియనున్న కాలపరిమితి
- అయినా డోంట్ కేర్ అంటున్న పాలకులు
- టూర్ ముగిశాక గ్రేటర్ ను అభివృద్ధి చేస్తామంటూ డాంబికాలు
- మేయర్, కార్పొరేటర్ల తీరుపై సర్వత్రా విమర్శలు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** వరంగల్ మహా నగరపాలక సంస్థ పాలక మండలి పదవీకాలం మరో ఏడు మాసాల్లో ముగియనుంది. ఈ సమయంలో ప్రతి పైసా పద్ధతిగా ఖర్చుచేసి నగరాభివృద్ధికి బాటలు వేయడం సర్వసాధారణం. ఈ ఏడు, ఎనిమిది నెలల్లో చేసిన అభివృద్ధి పనులే రానున్న ఎన్నికల్లో వారి గెలుపు, ఓటములకు కారణమవుతాయి. గత పాలకవర్గాలు ఇదే లాజిక్ ను ఫాలో అయ్యారు. కాని ఈ పాలకవర్గం మాత్రం ఈ చిన్న లాజిక్ ను మరిచినట్లుంది. పాలకవర్గం చివరి రోజుల్లో ప్రజల సొమ్ముకు కాపలాదారులుగా వ్యవహరించాల్సిన బల్దియా పెద్దలు దుబారాకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. దీనిని కొంతమంది కార్పొరేటర్లు వ్యతిరేకించినా అధికారం ఉందికదాని అక్షరాల అరకోటి నిధులకు ఎసరు పెట్టారు. మేయర్ గుండు సుధారాణి నేతృత్వంలో అన్నీ మరచి ఆరు రోజులు ఆనందంగా గడిపేందుకు సకుటుంబ సమేతంగా శంషాబాద్ లో ఫ్లైట్ ఎక్కి ఇండోర్ లో ల్యాండ్ అయ్యారు.

### ఆరు రోజులు..

ఈ నెల 14 నుంచి 19 వరకు ఆరు రోజుల పాటు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్, రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ లలో పర్యటించేందుకు కార్పొరేటర్లు, అధికారులు ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో రెండు బస్సుల్లో బయలు దేరి బేగంపేట ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. అక్కడి నుంచి రాత్రి 8.10 గంటలకు రెండు విమానాల్లో ఇండోర్ కు చేరుకున్నారు. మేయర్ గుండు సుధారాణితోపాటు 55 మంది కొర్పొరేటర్లు, 23 మంది బల్దియా వింగ్ అధికారులు ఈ టూర్ లో పాల్గొన్నారు. అయితే మహిళా కార్పొరేటర్ల భర్తలు, పురుష కార్పొరేటర్ల భార్యలు, వారి పిల్లలు మొత్తం 40 మంది బల్దియా నిధులతో విమానంలో ప్రయాణించడం వివాదంగా మారింది. మేయర్ తన హోదాకు తగ్గట్టుగానే బిజినెస్ క్లాస్ లో ప్రయాణించగా, కార్పొరేటర్లు, అధికారులు ఎకానమీ క్లాస్ లో ప్రయాణించి బల్దియాకు కొంత ఆదాయాన్ని మిగిల్చారు. అయితే కుటుంబ సమేతంగా సాగిన ఈ యాత్ర పక్కా విహార యాత్ర అంటూ కొందరు సామాజిక కార్యకర్తలు ఘాటుగా విమర్శించినా బల్దియా పాలకవర్గం మాత్రం డోంట్ కేర్ అంటున్నారు. మేయర్ గుండు సుధారాణి, డిప్యూటీ మేయర్ రిజ్వాన్ షమీమ్ తో పాటు మొత్తం 55 మంది కార్పొరేటర్లు వారి కుటుంబ సభ్యులు స్టడీ టూర్ కు 11 మంది కార్పొరేటర్లు వివిధ కారణాలతో దూరంగానే ఉన్నారు.

### అరకోటి ఖర్చు..

బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒకటి లేదా రెండు సంవత్సరాల్లో స్టడీ టూర్ నిర్వహించడం గత కొంత కాలంగా ఆనవాయితాగా వస్తోంది. వారు ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేసిన విషయాలను గ్రేటర్ లో అమలు చేసేందుకు కూడా వారికి కొంత సమయం ఉండేది. అలాంటిది మరో ఏడు నెలల కాలపరిమితి ఉన్నా స్మార్ట్ సిటీ నిధులనుంచి రూ.50 లక్షలు కేటాయించి విహార యాత్రలు నిర్వహించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడు నెలల కాలంలో వారు పొడిచేదేంటంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని రోజులు అభివృద్ధిని పక్కన బెట్టి అధ్యయనం చేసేందుకు ఇండోర్, జైపూర్ బయలు దేరడం విడ్డూరంగా ఉందంటున్నారు. గతంలో రూ.16.50 లక్షలు ఖర్చుచేసి 66 మంది కార్పొరేటర్లకు మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసి అందించిన బల్దియా పాలకవర్గం చివరి రోజుల్లో రూ.50 లక్షలతో స్టడీ టూర్ నిర్వహించడం చూస్తుంటే సొమ్మొకడిది.. సోకొకడిది అన్నట్లు ఉందని నగర ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.









### వినాయక టెంపుల్ దర్శనం..

స్టడీ టూర్ లో భాగంగా పలువురు కార్పొరేటర్లు కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఇండోర్ లోని వినాయక టెంపుల్ ను దర్శించుకున్నారు. మేయర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తమ స్టడీ టూర్ విజయవంతం కావాలంటూ మొక్కుకున్నారు. మరిన్ని దేవస్థానాలు సందర్శించేలా ఆజ్ఞ ఇవ్వాలంటూ లంబోదరుడిని వేడుకున్నారు.

## 'నమస్తే 'కు తె(తి)గుళ్లు..

- పత్రికను అడ్డం పెట్టుకుని ఎడిటర్ బ్లాక్ మెయిలింగ్
- నెట్టింట వైరల్ గా మారిన బాధితుల లేఖ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పెద్దలు చెప్పినట్లు కంచే చేను మేస్తే కాచేవారెవరు..? నమ్మి పత్రిక ఎడిటర్గా బాధ్యతలు అప్పగిస్తే చేసిందేమిటి..? అడుగడుగునా చీకటి దందాలు చేసి రూ.200 కోట్ల అవినీతి సంపాదన వెనకేసుకుంటివి. ఐదేళ్లలో నమస్తే తెలంగాణ పత్రికలో పనిచేస్తున్న వివిధ విభాగాల ఉద్యోగుల జీతాలు పెంచకపోతివి. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కోట్లాది రూపాయల ఆదాయంతో లాభాల బాట పట్టినా జీతాలైతే పైసా పెంచకపోతివి.. సిబ్బందిని తగ్గించినా జీతాల్లో మాత్రం పెరుగుదల లేకపోయే.. నిన్ను నమ్మి ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్ నీకు పత్రిక ఎడిటర్ గా బాధ్యతలు అప్పగిస్తే చేస్తున్నదేమిటి అంటూ బాధితుల లేఖ నెట్టింట వైరల్ గా మారింది. ఆదివారం నుంచి ఈ లేఖ అందరినీ ఆలోచింపజేస్తోంది. నీకు నచ్చిన, నీ అడుగులకు మడుగులొత్తే వారికి జీతాలు పెంచితివి.. అలాంటి వారికే పదోన్నతులు ఇస్తివి.. రాష్ట్రంలో ఇతర ఏ పత్రికల్లో లేని దుస్థితి నమస్తే తెలంగాణా పత్రికలో ఉండేందుకు కారణమైతివి. దీనికి నీవు కారణం కాదా.. ఎమ్మెల్యేలు, మంత్రుల వద్ద వివాదాలు సెటిల్ చేస్తూ రకరకాల బ్లాక్ మెయిలింగ్ లతో కోట్లాది రూపాయలు వసూలు చేసింది నిజం కాదా.. నీవు కూడబెట్టిన ఆస్తుల విలువ రూ.200 కోట్లుకు పైగానే కాదా. దీనిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయంటూ నమస్తే తెలంగాణ ఎడిటర్ తిగుళ్ల క్రిష్ణమూర్తి బాధితులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే కేసీఆర్ కు లేఖ రాశారు. ఐదేండ్లలో రూ.200 కోట్ల



అవినీతి సంపాదన వెనకేసుకున్న నమస్తే తెలంగాణ పత్రిక ఎడిటర్ తిరుగుళ్ల క్రిష్ణమూర్తి అవినీతి లీలలు మీ ముందు ఉంచుతున్నాము. వీటి మీద మీ ఏజెన్సీల ద్వారా విచారణ జరిపి నిజమైతే అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలంటూ విజ్ఞప్తి చేశారు.

## సిగ్గు, శరం ఉంటే కడియం రాజీనామా చేయాలి

- బీఆర్ఎస్ నేత దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి సిగ్గు, శరం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం రాజయ్యను కలిసిన వినయ్ భాస్కర్ ఈ వ్యాఖ్యలు చేశారు. కారు గుర్తుపై గెలిచిన కడియం శ్రీహరి పార్టీ మారడం ఏ విలువలకు నిదర్శనమని ప్రశ్నించారు. కడియం కేవలం తన రాజకీయ ప్రయోజనాల కోసమే పార్టీ మారాడన్నారు. నీతి వాక్యాలు వల్లించే ఆయన అవినీతి చక్రవర్తి అని ఆరోపించారు. కూతురి రాజకీయ భవిష్యత్తు కోసమే కేసీఆర్కు, బీఆర్ఎస్ పార్టీకి వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. కడియం ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకుంటున్న తీరు ఊసరవెల్లిని తలపిస్తోందని ఎద్దేవా చేశారు. రాజయ్య పాదయాత్రకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే ఆయనను హౌస్ అరెస్ట్ చేయించారని వినయ్ భాస్కర్ ఆరోపించారు. ఉప ఎన్నికలు వస్తే స్టేషన్ ఘన్పూర్ గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు వ్యతిరేకంగా పాలన సాగిస్తోందని, నియంత, నిరంకుశ పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను ప్రజలు నిలదీస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

# తెలంగాణ యోధుల చరిత్ర పాఠ్యాంశాల్లో చేర్చాలి

- సాయుధ పోరాట చరిత్ర వక్రీకరిస్తున్న పాలకులు
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి
- ఘనంగా తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాలకులు వక్రీకరిస్తున్నారని, సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా వరంగల్‌లో సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం ద్వారానే ప్రజలకు స్వాతంత్ర్యం, స్వేచ్ఛ లభించాయని అన్నారు. సెప్టెంబర్ 17ను విమోచన దినోత్సవంగా బీజేపీ చేపట్టే కార్యక్రమాలు ప్రజలను మభ్యపెట్టేందుకేనని విమర్శించారు. నిజాం వ్యతిరేక పోరాటంలో బీజేపీకి ఎలాంటి పాత్ర లేదని, పైగా పోరాటాన్ని హిందూ, ముస్లింల మధ్య జరిగిన గొడవగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని స్పష్టం చేశారు. తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని, ట్యాంక్ బండ్‌పై సాయుధ పోరాట యోధుల విగ్రహాలు పెడతామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఎందుకు నెరవేర్చలేదని ఆయన ప్రశ్నించారు. సెప్టెంబర్ 17న అన్ని జిల్లా కేంద్రాలలో జాతీయ జెండాలను ఎగురవేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఆ రోజును ప్రజా పాలన దినోత్సవంగా జరపడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు టి.వెంకటరాములు, మేకల రవి, సిరబోయిన కరుణాకర్, జిల్లా నాయకులు దండు లక్ష్మణ్, గన్నారపు రమేష్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పోచమ్మ మైదానంలోని కమలమ్మ–అప్పన్న విగ్రహాలకు నివాళులు అర్పించి, ర్యాలీ నిర్వహించారు.

# ఘనంగా ఏఈలకు సత్కారం



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజినీర్స్ డే ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో, మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) పెద్ది ఆంజనేయులు పంచాయతీరాజ్ ఏఈ నోముల శ్రీలత, హౌసింగ్ ఏఈ పోకల ఆకాంక్షలను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఆంజనేయులు మాట్లాడుతూ, ఇంజినీరింగ్ కేవలం ఒక చదువు మాత్రమే కాదని, దేశాభివృద్ధికి ఇంజినీర్లు కీలకంగా వ్యవహరిస్తారని అన్నారు. ఇంజినీర్ల సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకురాలు సీహెచ్ శైలశ్రీ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పులిగిల్లలో ‘అమ్మ కోసం ఒక చెట్టు’



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని పులిగిల్ల ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులు చేపట్టిన “అమ్మ కోసం ఒక చెట్టు” (ఏక్ పడ్ మాకి నామ్) కార్యక్రమం పలువురి ప్రశంసలు అందుకుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో భాగంగా, మొక్కల పెంపకం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంపత్ రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయుడు సతీష్ మాట్లాడుతూ, తల్లిని ఎంత ఇష్టపడతారో, మొక్కను కూడా అంతే ప్రేమతో పెంచి సంరక్షించుకోవాలని విద్యార్థులకు సూచించారు. నేడు విద్యార్థులు, వారి తల్లులు కలిసి చేస్తున్న ఈ చిన్న ప్రయత్నం, రేపు పులిగిల్ల గ్రామం పచ్చగా మారడానికి దోహదపడుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమా, పద్మ, కవిత, ప్రదీప్, రాజేష్, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల కృషిని అందరూ అభినందించారు.

# శతాబ్దాల నాటి శివాలమర్రి చెట్టును పరిశీలించిన ఎమ్మెల్యే

**వరంగల్ వాయిస్, ఐనవోలు:** గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా నేలకొరిగిన ఐనవోలు మల్లిఖార్జున దేవాలయ సమీపంలోని శతాబ్దాల నాటి శివాలమర్రి చెట్టును వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు, టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. ఈ శివాలమర్రి చెట్టుకు దాదాపు 100 సంవత్సరాల చరిత్ర ఉందని, ఇది ఆలయానికి ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందని అన్నారు. దీనిని కాపాడటం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ వృక్షాన్ని రక్షించేందుకు అటవీశాఖ, దేవాదాయశాఖ, పర్యావరణ నిపుణులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అకాల వర్షాల వల్ల ఈ చెట్టు దెబ్బతినడం విచారకరమని, దీనిని రక్షించడానికి అవసరమైన సాంకేతిక పద్ధతులను అనుసరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు దేవస్థానం ఛైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ధర్మకర్తలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అధ్యాపకుల మరణాలతోనైనా ప్రభుత్వం చలించాలి



**వరంగల్ వాయిస్, సుబేదారి :** చాలీచాలని జీతాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న పార్ట్–టైమ్ (పాక్షిక) అధ్యాపకుల మరణాలు సంభవిస్తున్నాయని, వీటిని చూసైనా ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) పార్ట్–టైమ్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై. రాంబాబు తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ యూనివర్సిటీ హిస్టరీ విభాగం అధ్యాపకుడు రమేశ్, కేయూ జువాలజీ విభాగం అధ్యాపకుడు తిరుపతి గుండెపోటుతో మరణించిన సందర్భంగా కేయూ పరిపాలనా భవనం ముందు నిర్వహించిన సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పడిన తర్వాత పాక్షిక అధ్యాపకుల సమస్యలు మరింత పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత దశాబ్ద కాలంగా ప్రభుత్వం ఈ సమస్యలను పట్టించుకోకపోవడం వల్లే ఇలాంటి మరణాలు సంభవిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. రైతుల, చేనేత కార్మికుల ఆత్మహత్యల మాదిరిగానే అధ్యాపకుల మరణాలను కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి తమ సమస్యలు వినడానికి కూడా అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ సంతాప కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నరేందర్ నాయక్, డాక్టర్ తిరునహరి శేషు, డాక్టర్ బ్రహ్మయ్య, డాక్టర్ దేవోజి నాయక్, డాక్టర్ బాలు తదితరులు పాల్గొన్నారు. పార్ట్–టైమ్ అధ్యాపకుల అభ్యర్థన మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం మృతి చెందిన అధ్యాపకులకు నివాళులర్పించారు.

# నాపా ఉత్సవాలకు ‘వేముల’



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నార్త్ అమెరికా పద్మశాలి అసోసియేషన్ (నాపా) ఉత్సవాల కోసం తెలంగాణ ఆన్ లైన్ మీడియా వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ (తౌమ్వాజా) రాష్ట్ర కోశాధికారి, సీనియర్ జర్నలిస్ట్ వేముల సదానందం, ఆయన సతీమణి వేముల సౌందర్య అమెరికాకు పయనమయ్యారు. ఈ నెల 19, 20 తేదీల్లో వర్జీనియాలోని మాన్సాస్ లో గల మాగ్నోలియా గ్రాండ్ సెంటర్ లో జరగనున్న నాపా 12వ వార్షికోత్సవ వేడుకలకు హాజరవ్వాల్సిందిగా నాపా ప్రెసిడెంట్ శ్రీనివాస్ సాయిని, ప్రెసిడెంట్ ఎలెక్ట్ చెరుపల్లి వేములకు ఆహ్వానం పంపారు. లాభాపేక్ష లేని నాపా సంస్థ ఉత్తర అమెరికాలో స్థిరపడిన పద్మశాలీయుల సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల కోసం పనిచేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పద్మశాలి సమాజం ఐక్యత కోసం గ్లోబల్ పద్మశాలి అసోసియేషన్ (జీపీఏ)ను ప్రారంభించారు.

## ప్రముఖుల అభినందనలు..

నార్త్ అమెరికా పద్మశాలి అసోసియేషన్ (నాపా) ఉత్సవాలకు హాజరయ్యేందుకు అమెరికా పయనమవుతున్న సీనియర్ జర్నలిస్ట్ వేముల సదానందం నేతను పలువురు ప్రముఖులు అభినందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, మాజీ జడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు, క్రెడాయ్ వరంగల్ జిల్లా చైర్మన్ ఎర్రబెల్లి తిరుపతి రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ వన్నాల వెంకట రమణ, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, పద్మశాలి వర్కింగ్ జర్నలిస్టుల సహకార పరపతి సంఘం అధ్యక్షుడు వేముల నాగరాజు, ఉపాధ్యక్షుడు, ,వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, ప్రధాన కార్యదర్శి వల్లాల వెంకట రమణ వేర్వేరు ప్రకటనలలో వేముల సదానందానికి శుభాకాంక్షలు తెలిపారు.

# ‘లక్ష గాంధీ విగ్రహాల ప్రదర్శన’

- పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** మహాత్మా గాంధీ జీవితం, సిద్ధాంతాలను ప్రస్తుత తరానికి పరిచయం చేసే లక్ష్యంతో చేపట్టిన “లక్ష గాంధీ విగ్రహాల ప్రదర్శన” పోస్టర్‌ను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్లోబల్ గాంధీ ఫెడరేషన్ నిర్వాహకులు అక్టోబర్ 10 నుంచి 13 వరకు హైదరాబాద్‌లోని ఎల్.బీ. స్టేడియంలో జరగబోయే మహాత్మా గాంధీ జాతీయ సుస్థిర విజ్ఞాన సదస్సు అండ్ స్వదేశీ మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గాంధీజీ చూపిన శాంతి, అహింస, స్వదేశీ మార్గాలు సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. గాంధీ సిద్ధాంతాలను యువతకు చేరవేయడానికి ఇలాంటి కార్యక్రమాలను ఎక్కువగా నిర్వహించాలని ఆయన సూచించారు. లక్ష గాంధీ విగ్రహాల ప్రదర్శన అనేది ఒక సామాజిక మార్పును ఆకాంక్షించే విప్లవాత్మక ఆలోచన అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కోఆర్డినేటర్ డాక్టర్ పులి అనిల్, యువజన విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసి సాయిచంద్, యూత్ వింగ్ వైస్ ప్రెసిడెంట్ సంతోష్ రెడ్డి, హనుమకొండ అధ్యక్షులు సాగర్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ రాజేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ సంజయ్ రెడ్డి, నాయకులు రాజకుమార్, ప్రశాంత్, సతీష్ అరుణ్, సంతోష్, దొరబాబు, సతీష్, సోమేశ్ పాల్గొన్నారు.

# అన్నారం దర్గా ఆర్థిక వ్యవహారాలపై దర్యాప్తు చేయాలి

## ◆ కలెక్టర్ ను కోరిన గ్రామ యువకుడు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** అన్నారం షరీఫ్‌లోని హజ్రత్ యాకూబ్ షావలి దర్గా ఆర్థిక వ్యవహారాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరుతూ గ్రామ యువకుడు రాపోలు రవి సోమవారం వరంగల్ జిల్లా కలెక్టర్‌కు ఒక లేఖ సమర్పించారు. గ్రీవెన్స్ డే సందర్భంగా ఆయన కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. 2025 మార్చి 21 నుంచి జూలై 22 వరకు హుండీ ద్వారా వచ్చిన ఆదాయం, బంగారం, వెండి వివరాలను ఆడిట్ చేయాలి. బండ్ల ఫాతియా పూజ, కోడి కందూర్ సహా వివిధ టిక్కెట్ల అమ్మకాలపై విచారణ జరపాలి. ప్రయాణ ఖర్చులు, ఇతర ఖర్చుల కోసం జమ చేసిన రశీదులను పరిశీలించాలి. కొబ్బరి చిప్పలు, జెండాలు వంటి సబ్-టెండర్లకు సంబంధించిన ఒప్పంద పత్రాలను పరిశీలించాలి. 2024, 2025 సంవత్సరాల్లో ఉర్స్ ఉత్సవాలకు వక్ఫ్ బోర్డు పంపిన నిధులను ఆడిట్ చేయాలి. భక్తులపై జరిగిన దోపిడీ ఆరోపణలను విచారించాలి. పారిశుధ్య నిర్వహణపై వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ పనితీరును అంచనా వేయాలి. భక్తుల కోసం చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులు, ఏర్పాట్లపై దర్యాప్తు చేయాలి. సీసీటీవీ కెమెరాల కార్యాచరణను పరిశీలించి, పర్యవేక్షించాలి. లడ్డూ టెండర్లు, ఆర్థిక లావాదేవీలను విచారించాలి. ఇన్‌స్పెక్టర్‌పై ఉన్న అవినీతి ఆరోపణలను దర్యాప్తు చేయాలి. హెడ్‌స్కార్ఫ్ టెండర్లు, వాటి ఆర్థిక లావాదేవీలను పరిశీలించాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

# అథ్లెటిక్స్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

## సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విడుదల



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అక్టోబర్ 16, 17, 18 తేదీలలో జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో జరగనున్న 5వ ఓపెన్ అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆయన ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని, ముఖ్యమంత్రితో కలిసి అథ్లెటిక్స్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, రాష్ట్ర అథ్లెటిక్ చైర్మన్ ఎర్రబెల్లి వరద రాజేశ్వర్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, జిల్లా క్రీడా శాఖ అధికారి అశోక్, జాయింట్ సెక్రటరీ సారంగం పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ సిరంగి సంతోష్ జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, పరకాల:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ జన్మదిన వేడుకలు పరకాలలో ఘనంగా నిర్వహించారు. పరకాల పట్టణ బీజేపీ శాఖ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధి చందుపట్ల రాజేందర్ రెడ్డి, పరకాల పట్టణ ప్రధాన కార్యదర్శి సంఘ పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, బీజేపీ నాయకులు గురుప్రసాద్, మేఘనాథ్, ఆర్.పి.లాల్, కొలనుపాక భద్రయ్య, బెజ్జంకి పూర్ణ చారి, మార్త రాజభద్రయ్య, ఎర్ర రామన్న, బాసాని సోమరాజు, కుక్కల విజయ్, పెనిశెట్టి శారద, ఆకుల రాంబాబు, మిరుదొడ్డి నరేష్, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య హౌస్ అరెస్టు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య చేసిన వ్యాఖ్యలు ఉద్రిక్తతకు దారితీస్తున్నాయి. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరినందున ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఆదివారం రాజయ్య డిమాండ్ చేసిన నేపథ్యంలో, సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రఘునాథపల్లి మండలంలో పాదయాత్రకు సిద్ధమైన రాజయ్యను హనుమకొండలోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడికి వెళ్లడం మంచిది కాదని పోలీసులు సూచించినా రాజయ్య వినకపోవడంతో ఆయనను గృహ నిర్బంధంలో ఉంచారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఆదివారం రాజయ్య మీడియాతో మాట్లాడుతూ కడియం శ్రీహరికి పౌరుషం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కడియం ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోవడానికి కూడా సిగ్గు లేదని, కాంగ్రెస్ కార్యకర్తలు కూడా రాజీనామా చేయమని అడుగుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కూతురి కోసం పార్టీ మారి రూ.200 కోట్లకు అమ్ముడుపోయాడని ఆరోపించారు. కడియం శ్రీహరిపై స్పీకర్ వెంటనే అనర్హత వేటు వేయాలని రాజయ్య డిమాండ్ చేశారు.

# వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్:** గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ట్రస్ట్ సభ్యులు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క, వరంగల్, హనుమకొండ జిల్లాల ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, దొంతి మాధవ రెడ్డి, కె.ఆర్. నాగరాజులను మర్యాదపూర్వకంగా కలిసి 'బాపు బాట' గాంధీజీ లక్ష విగ్రహాల పోస్టర్‌ను ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జీవిత సేవలు, అహింసా మార్గం భారతదేశ స్వాతంత్ర్యానికి ఎంతగానో తోడ్పడ్డాయని, ప్రపంచవ్యాప్తంగా పౌర హక్కుల ఉద్యమాలకు ఆయన ప్రేరణగా నిలిచారని అన్నారు. అక్టోబర్ 10 నుంచి 14 వరకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరగనున్న మహాత్మా గాంధీ జాతీయ సుస్థిర విజ్ఞాన సదస్సును విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంస్థల చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి, ఏఐసీసీ కోఆర్డినేటర్ పులి అనిల్, రాష్ట్ర కమిటీ సభ్యులు సంజయ్ రెడ్డి, సాయి చంద్, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట:** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) వర్ధన్నపేట శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోళ్ల అజయ్ మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా విద్యార్థుల జీవితాలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా రూ. 8,600 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, దీనివల్ల ప్రైవేటు కళాశాలల్లో చదువుకునే పేద, మధ్యతరగతి విద్యార్థులకు చదువు దూరమవుతోందని మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చే స్కాలర్‌షిప్ భిక్షం కాదని, అది విద్యార్థుల హక్కని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను చిన్న చూపు చూస్తోందని, సంక్షేమ పథకాలకు డబ్బులు వస్తున్నా విద్యార్థులకు ఇవ్వాల్సిన బకాయిలను మాత్రం చెల్లించడం లేదని అజయ్ విమర్శించారు. ముఖ్యమంత్రి విద్యార్థుల జీవితాలు ఆందోళనకరంగా ఉన్నా చోద్యం చూస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను చెల్లించాలని, లేకపోతే ఉద్యమాలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ వర్ధన్నపేట నగర కార్యదర్శి చిక్కొండ వినయ్ సహా పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం, పోలీసులు వీరిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి, ఎమ్మార్వో వద్ద బైండోవర్ చేసి విడిచిపెట్టారు.

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

## తహసీల్దార్ గిరిబాబు




**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని వెంకటాపూర్ తహసీల్దార్ గిరిబాబు సూచించారు. సోమవారం వెంకటాపూర్ తహసీల్ కార్యాలయంలో కొత్తగా విధుల్లో చేరిన రెవెన్యూ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి, వారికి విధులకు సంబంధించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గిరిబాబు మాట్లాడుతూ కొత్తగా జీపీఓలుగా చేరిన అధికారులు తమ గ్రామాల్లో ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా, గ్రామాల్లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించాలని సూచించారు. ప్రతి భూ సమస్యపై ప్రత్యేక అవగాహనతో పనిచేసి, రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం, కొత్తగా చేరిన జీపీఓలకు, ఆర్ఐ సుధాకర్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలోని వివిధ అంశాలపై సిబ్బందితో సుదీర్ఘంగా చర్చించి, భవిష్యత్ కార్యాచరణపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పెన్షన్ దారుల ఆధ్వర్యంలో మహా ధర్నా



**వరంగల్ వాయిస్, పరకాల:** వివిధ రకాల పింఛన్లను పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పరకాల మండల తహసీల్దార్ కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహించారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత, బీడీ కార్మికులు పాల్గొన్నారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ పరకాల మండల ఇంఛార్జి అంకిల్ల రాజు మాదిగ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చారని, ఆ మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వికలాంగులు, వృద్ధులు, ఇతర పింఛన్దారులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. దివ్యాంగుల పింఛన్‌ను రూ. 6,000కు పెంచాలి. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత, బీడీ కార్మికులకు పింఛన్‌ను రూ. 4,000కు పెంచాలి. పూర్తి కండరాల క్షీణత కలిగిన వారికి రూ. 15,000 ఇవ్వాలి. అర్హత ఉన్న దరఖాస్తుదారులందరికీ కొత్త పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పరకాల మండల తహసీల్దార్ విజయలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పరకాల కో-ఇంఛార్జ్ సుంచు రజిని కుమార్ మాదిగ, వికలాంగుల హక్కుల పోరాట సమితినాయకులు, ఇతర పెన్షన్ దారులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో చదువుకోవాలి

◆ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, గణపురం:** ప్రజా ప్రభుత్వంలో విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రతి ఒక్క విద్యార్థి ఆత్మవిశ్వాసంతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం గణపురం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య తన మొదటి నెల వేతనం నుంచి వంద మంది విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేయగా, ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు సమానత్వంతో విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద విద్యార్థుల కోసం ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ, పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి కూడా వేగంగా జరుగుతోందని తెలిపారు. విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా భరతనాట్యంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన తొమ్మిదో తరగతి విద్యార్థి మోరె జగదీశ్వర్‌ను ఎమ్మెల్యే అభినందించారు. రాష్ట్ర స్థాయిలో విజయం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం.దేసు సతీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ జి.కిష్టయ్య, వైస్ చైర్మన్ రేపాక రాజేందర్, సొసైటీ చైర్మన్ కె.కుమార్ యాదవ్, మాజీ జడ్పీటీసీలు ఎం.రాజయ్య, ఎం.శివశంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ కార్యాలయం ముట్టడి



**వరంగల్ వాయిస్, దామెర:** తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు, ఇతర పెన్షనర్లు దామెర తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ కార్యక్రమం ఎంఆర్పీఎస్ (MRPS) దామెర మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్ మాదిగ ఆధ్వర్యంలో జరిగింది. దివ్యాంగుల పెన్షన్‌ను రూ. 6,000కు పెంచాలి. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, బీడీ కార్మికుల పెన్షన్‌ను రూ. 4,000కు పెంచాలి. కండరాల క్షీణత కలిగిన వారికి రూ. 15,000 పెన్షన్ అమలు చేయాలి. కొత్తగా దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలి. రాజకీయాల్లో దివ్యాంగులకు భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ నిరసన కార్యక్రమం నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. అంబేద్కర్ సెంటర్ నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లిన నిరసనకారులు, అక్కడ పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం, డిప్యూటీ తహసీల్దార్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ పీఎస్, ఎమ్మార్పీఎస్, సీపీహెచ్ పీఎస్ తో పాటు వివిధ వర్గాలకు చెందిన పెన్షన్ దారులు, బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

# దామెరలో 'సేవా పక్వాడ' కార్యశాల

**వరంగల్ వాయిస్, దామెర:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని, సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్న 'సేవా పక్వాడ' కార్యక్రమంలో భాగంగా దామెర మండలంలోని లాదెళ్ళ గ్రామంలో మండల స్థాయి కార్యశాల నిర్వహించారు. మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సేవా పక్షం కన్వీనర్ గన్ను సతీష్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరామ్ రెడ్డి మాట్లాడుతూ సేవా పక్వాడలో భాగంగా రక్తదాన శిబిరాలు, స్వచ్ఛతా కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. బీజేపీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలతో మమేకం కావాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గండు ముఖేష్, మండల కార్యదర్శి మాందాటి ఈశ్వరమ్మ, మండల కోశాధికారి బత్తుల నాగేందర్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల రమేష్, యువ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల సుమంత్, సేవా పక్వాడ కో-కన్వీనర్ గడ్డం కార్తీక్, శక్తి కేంద్ర ఇంచార్జి ఎక్కలదేవి రమేష్, బూత్ అధ్యక్షులు అన్నబోయిన రోహిత్, జక్కుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యా సమస్యల పరిష్కారానికి 'స్వేరో' బైక్ యాత్ర



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ప్రభుత్వ, ప్రైవేటు, సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'విద్యార్థి బైక్ యాత్ర' ప్రారంభమైంది. సెప్టెంబర్ 15 నుంచి 20 వరకు ఈ యాత్ర కొనసాగుతుందని స్వేరో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయని అన్నారు. ఈ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ యాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు. అలాగే స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గజవెల్లి శ్రావణ్, చెట్టుపల్లి శివకుమార్, శ్రీకాంత్, దేవరాజు, కార్తీక్, నాగరాజు, శ్రీనాథ్, అనిల్, సిద్ధార్థ్, దేవరాజ్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

# ఎంఏ తెలుగు ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

**వరంగల్ వాయిస్, వరంగల్:** తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞానపీఠంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఎంఏ తెలుగు కోర్సు ప్రవేశాల కోసం ఈ నెల 19, 20 తేదీలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరింత సమాచారం కోసం 9989139136 లేదా 9989417299 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

# సురక్షిత ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలి



**వరంగల్ వాయిస్, ములుగు :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పేదల కోసం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను విడతల వారీగా అర్హులందరికీ మంజూరు చేయడం జరుగుతుందని, ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకునే లబ్ధిదారులు సురక్షిత ప్రాంతాల్లోనే నిర్మించుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. సోమవారం గోవిందరావుపేట మండలం మొట్లగూడెం, ఎస్.ఎస్.తాడ్వాయి మండలం వెంగలపూర్ గ్రామంలో పలు గ్రామాలకు చెందిన అర్హులైన ఇందిరమ్మ లబ్ధిదారులకు నిర్మాణ పట్టాలను జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్ తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని లక్ష్యంతో రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇండ్ల నిర్మాణ కార్యక్రమాలు చేపట్టిందని, మొదటి దఫాలో చేపట్టిన ఇండ్ల నిర్మాణ కార్యక్రమాలు పూర్తి కావస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ జిల్లాలో పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. డీపీఓ దేవ్ రాజ్, ఎంపీడీఓలు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులను వెంటాడుతున్న యూరియా కొరత



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలో యూరియా కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది. సోమవారం నాడు రాయపర్తి క్లస్టర్ పరిధిలోని రైతులకు యూరియా పంపిణీ కోసం టోకెన్లు ఇస్తున్నారని తెలిసి, రైతులు పెద్ద సంఖ్యలో రైతు వేదిక వద్దకు చేరుకున్నారు. ఉదయం 5 గంటలకే అక్కడికి చేరుకున్న రైతులు, నిలబడే ఓపిక లేక తమ చెప్పులను వరుసలో పెట్టి వేచి చూశారు. అధికారులు పోలీసుల పర్యవేక్షణలో టోకెన్లు జారీ చేశారు. అనంతరం, యూరియాను పరకాల వ్యవసాయ మార్కెట్ యార్డులో తీసుకోవాలని రైతులకు సూచించారు. దీంతో రైతులు పరకాలకు పరుగులు పెట్టారు. అయితే, పరకాలకు వెళ్ళిన తర్వాత ఒక రైతుకు ఒక బస్తా మాత్రమే ఇచ్చారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు చోట్ల వరుసలో నిలబడి, పనులను మానుకొని ఉంటే కేవలం ఒక బస్తా మాత్రమే ఇవ్వడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ యూరియా కొరతకు పలు కారణాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడ్డారు. రైతులు పంటలకు సిఫారసు చేసిన దానికంటే ఎక్కువగా యూరియా వాడటం, మళ్లీ దొరకదనే భయంతో నిల్వ చేసుకోవడం, అలాగే ప్రత్యామ్నాయంగా అందుబాటులో ఉన్న నానో యూరియాపై అవగాహన లేకపోవడం వంటి కారణాల వల్ల యూరియాకు డిమాండ్ ఏర్పడిందని తెలిపారు.

## యూరియా వాడకంపై అవగాహన కల్పిస్తున్నాం:

**మండల ఏఈఓ పోరిక జై సింగ్**



మండలంలో పంటలకు యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి పోరిక జై సింగ్ తెలిపారు. ప్రస్తుతం మండలంలో 7,468 ఎకరాల్లో వరి, 8,965 ఎకరాల్లో పత్తి, 1,500 ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతున్నాయని అంచనా వేశారు. ఈ పంటల వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓ) ద్వారా నమోదు చేయిస్తున్నామని తెలిపారు. ఎకరానికి సుమారు మూడు బస్తాల యూరియా వాడే అవకాశం ఉందని, ఇప్పటివరకు మాదారం సొసైటీ, ప్రైవేట్ డీలర్లు, ఆగ్రోస్ కేంద్రాల ద్వారా మొత్తం 24,000 బస్తాలు పంపిణీ చేశామని ఆయన వివరించారు. అలాగే, ప్రత్యామ్నాయంగా ఉన్న నానో యూరియా వాడకం గురించి కూడా రైతులకు పత్రికా ప్రకటనల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని జై సింగ్ తెలిపారు.

# చౌటపల్లి పీఏసీఎస్ పాలకమండలి రద్దు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని చౌటపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పాలకమండలిని ప్రభుత్వం రద్దు చేసింది. పాలకమండలిలో అవినీతి ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. సొసైటీకి ఇంచార్జిగా జిల్లా సహకార అధికారి కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్ రెడ్డిని నియమించారు. ఆగస్టు 14న పాలకమండలి పదవీకాలం ముగియగా, ప్రభుత్వం ఆరు నెలల పాటు పొడిగించిన విషయం తెలిసిందే.

# గుడుంబా విక్రేతల అరెస్ట్



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని వివిధ గ్రామాల్లో అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్న వారిపై ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురిని అదుపులోకి తీసుకుని, తహసీల్దార్ వెంకటస్వామి ఎదుట బైండోవర్ చేశామని వర్ధన్నపేట ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ సరిత తెలిపారు. అన్నారం గ్రామానికి చెందిన మౌర్య హనుమంతు, పిట్టల రామక్క, చింత నెక్కొండకు చెందిన బొచ్చు లచ్చమ్మ, పర్వతగిరి గ్రామానికి చెందిన పుల్లూరు కుమారస్వామిల నుంచి 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ గుడుంబా విక్రయాలపై ఎక్సైజ్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని అధికారులు హెచ్చరించారు.

# ఘనంగా భాగ్యలక్ష్మి–కొమురయ్యల షష్టిపూర్తి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** కాకతీయ మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ డాక్టర్ మచ్చిక ప్రమోద్ గౌడ్ తల్లిదండ్రులు భాగ్యలక్ష్మి–కొమురయ్య గౌడ్‌ల షష్టిపూర్తి వేడుకలు సోమవారం హనుమకొండలోని వారి నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా షష్టిపూర్తి చేసుకున్న ఆ దంపతులను గౌడ సంఘాల నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బోనగాని యాదగిరి గౌడ్, అనంతుల రమేశ్ గౌడ్, పులి మోహన్ గౌడ్, లగ్గ రాంచందర్ గౌడ్, బుర్ర శ్యామ్‌కుమార్ గౌడ్, రాజేందర్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలక



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** దేశాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకమని వాసవి క్లబ్స్ ఐపీసీ చకిలం రాజేశ్వర్ రావు అన్నారు. భారీ ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, రైల్వేలు, మనం వాడే యంత్ర సామగ్రి వంటివి ఇంజినీర్ల కృషిపైనే ఆధారపడి ఉంటాయని ఆయన పేర్కొన్నారు. జాతీయ ఇంజినీర్స్ డే సందర్భంగా వాసవి క్లబ్ హసన్‌పర్తి ఆధ్వర్యంలో ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఎస్.ఆర్.ఎస్.పి క్యాంపులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం, ఆర్.టి.సి కాలనీలోని విద్యుత్ కార్యాలయంలో టి.ఎస్.ఎన్.పి.డి.సి.ఎల్ ఏ.ఈ. శిరీష్, సబ్ ఇంజినీర్ స్వామి నాయక్‌లను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సంద్రు నాగేందర్, కోశాధికారి మాధవ్ శంకర్, నాగమల్ల సుధీర్, డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రటరీ శంకర్, మాజీ అధ్యక్షులు భీష్మనాధం, మంచెన శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారిని ఆశీర్వదించిన అంబాల రాజు



**వరంగల్ వాయిస్, జమ్మికుంట:** మండలంలోని తనుగుల గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చిలుముల వసంత రామస్వామి మనవడు ఘన ఆదిత్య పుట్టినరోజు వేడుకలు సోమవారం నాగంపేటలోని సౌభాగ్యలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు, స్వప్న దంపతులు హాజరయ్యారు. వారు ఘన ఆదిత్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, ఆశీర్వదించారు.

# దేవుని పేరు చెప్పి రాజకీయాలు చేయవద్దు

◆ పూజారుల అనుమతితోనే మేడారం అభివృద్ధి పనులు

◆ రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**వరంగల్ వాయిస్, ములుగు:** మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రాంగణంలో గిరిజన గోత్రాలు, పూజ ఆచారాల ప్రకారం, అమ్మవార్ల పూజారుల అంగీకారం పొందిన తర్వాతే నూతన పనులు చేపడతామని రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (DPR) పూర్తయ్యాక ముఖ్యమంత్రితో సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటామని ఆమె తెలిపారు. సోమవారం ములుగు కలెక్టరేట్‌లో ఇంచర్ల గ్రామంలో ఆయిల్ పామ్ పరిశ్రమ ఏర్పాటు కోసం భూములు కోల్పోయిన 41 మంది రైతులకు మంత్రి సీతక్క, ఎంపీ పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. కలిసి పట్టాలను పంపిణీ చేశారు. ఇంచర్ల ఏకో పార్క్ వద్ద వారికి ప్రభుత్వ భూమి కేటాయించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్ల విస్తరణ, డైవర్షన్ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టబోతున్నామని తెలిపారు. ఈ పనుల నివేదికలను అధికారులు సిద్ధం చేస్తున్నారని, జాతరకు పక్షం రోజుల ముందే పనులను పూర్తి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా గద్దెలపై రాజకీయాలు చేయడం సరికాదని ఆమె హితవు పలికారు. దేవుడి దగ్గర రాజకీయాలు వద్దని సూచించారు. ఎంపీ పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ.. జాతర ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, మేడారంలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ దివాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సి.హెచ్. మహేందర్ జి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# భారీ ర్యాలీ రాస్తారోకో



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో 2,000 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఈ కారణంగా అదాలత్ జంక్షన్‌లో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. అనంతరం పోలీసులు విద్యార్థులను అరెస్ట్ చేసి సుబేదారి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీడీపీఎంఏ) వ్యవస్థాపక అధ్యక్షుడు సంఘం రెడ్డి సుందర్ రాజు యాదవ్ మద్దతు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాష బోయిన సంతోష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ. 8,000 కోట్ల ఫీజు బకాయిల వల్ల విద్యార్థుల చదువులకు ఆటంకాలు కలుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ కళాశాలలు తరగతులు నిలిపివేయడం, సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర అని ఆయన ఆరోపించారు. సంఘం రెడ్డి సుందర్ రాజు యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా బకాయిలను విడుదల చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. లక్షల కోట్ల నిధులు వృథాగా ఖర్చు చేస్తున్న ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును విస్మరిస్తోందని విమర్శించారు. తెలంగాణలో 14 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఫీజు బకాయిలపై ఆధారపడి చదువుకుంటున్నారని, వారి చదువుకు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే తెలంగాణ ఉద్యమాన్ని మరిపించే విధంగా విద్యార్థులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరు ప్రణీత్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు కుక్కల కుమార్, వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జు జ్యోతి, జిల్లా సమితి సభ్యులు, సిపతి వినయ్, టీపీడీపీఎంఏ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పెండింగ్ స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయాలు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2022–23, 2023–24, 2024–25 సంవత్సరాలకు గాను రూ. 570 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు బకాయి ఉన్నాయని వేణుగోపాల్ గౌడ్ పేర్కొన్నారు. దీనివల్ల ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లను ఇవ్వడం లేదని, దీంతో ఉన్నత చదువులకు విద్యార్థులు దూరమవుతున్నారని అన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల భవిష్యత్తు కోసం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

**వరంగల్ వాయిస్, చిట్యాల:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పోషణ్ బీ పఢాయి బీ' కార్యక్రమం చిట్యాల మండలం జూకల్ గ్రామంలోని రైతు వేదికలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని చిట్యాల, టేకుమట్ల మండలాల అంగన్‌వాడీ టీచర్లు, సూపర్వైజర్లు జయప్రద, సరోజన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాలు సెప్టెంబర్ 17 వరకు కొనసాగుతాయని సూపర్వైజర్లు తెలిపారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం మూడు నుంచి ఆరు సంవత్సరాల బాల బాలికలను ప్రీ–ప్రైమరీ పాఠశాలల్లో చేర్పించి, వారికి పౌష్టికాహారం అందించడంతోపాటు, చదువుపై ప్రోత్సహించడం అని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ తిరుపతి, రవీందర్, రాజరాజేశ్వరితో పాటు 100 మంది అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌పై అసత్య ఆరోపణలు మానుకోవాలి

◆ మండల పార్టీ అధ్యక్షుడు రమేష్



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్:** కాంగ్రెస్ పార్టీపై మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అసత్య ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్ అన్నారు. సోమవారం ఆత్మకూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరకాల సొసైటీ చైర్మన్లపై కాంగ్రెస్ పార్టీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ధర్మారెడ్డి ఆరోపించడం ఎంతవరకు సమంజసమని రమేష్ ప్రశ్నించారు. సొసైటీకి చెందిన ఇనుప సామాను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేశారని, వాటిపై విచారణ జరిపి సొసైటీ అధికారులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఈ సంఘటనకు కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికి సంబంధం లేదని స్పష్టం చేశారు.ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సొసైటీల బలోపేతానికి కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఆత్మకూరు మండలంలోని పెంచికులపేట సొసైటీ నిర్వహణను ఎమ్మెల్యే స్వయంగా మెచ్చుకున్నారని, పెద్దాపూర్ సొసైటీలో గన్ని బ్యాగులు అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. పది సంవత్సరాలు ఎమ్మెల్యేగా పనిచేసిన ధర్మారెడ్డి చౌకబారు ఆరోపణలు చేయడం తగదని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బీరం సునంద సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు, మాజీ జడ్పీటీసీ కక్కర్ల రాధిక రాజు, మాజీ ఎంపీపీ మార్క సుమలత రజనీకర్ గౌడ్, మాజీ సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.



# సపోర్ట్ లేకుంటే రాణించడం కష్టమే

### నటి ప్రియాంక చోప్రా మనోగతం

చిత్రసీమలో బ్యాక్ గ్రౌడం సపోర్టు లేకుండా రాణించడం కష్టమే అని నటి ప్రయియాంక చోప్రా అభిప్రాయ పడ్డారు. 2000 సంవత్సరంలో మిస్ వరల్డ్ కిరీటాన్ని సొంతం చేసుకున్న అనంతరం నటి ప్రియాంక చోప్రా ఇండస్ట్రీక్రి వచ్చి స్టార్‌గా ఎదిగారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తాను సొంత నిర్మాణసంస్థను ప్రారంభించడానికి గల కారణాన్ని వెల్లడిరచారు. తరతరాలుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్న వారు స్టార్‌లుగా ఉన్నారు. అలాంటప్పుడు బయట నుంచి వచ్చినవారు పరిశ్రమలో కొనసాగడం అంత సులభం కాదు. కానీ, నేను ఎంతో కష్టపడి ఆఫర్లు అందుకొని సక్సెస్ అయ్యాను. ఏదైనా పట్టుదలతో ప్రయత్నిచడం నా అలవాటు. నేను ఇబ్బందిపడినట్లు– ఎవరూ పడకూడదనే ఉద్దేశంతో.. సినీ నేపథ్యం లేకుండా కొత్తగా ఇండస్ట్రీక్రి వచ్చేవారిని ప్రోత్సహించడానికే నిర్మాణసంస్థను స్థాపించానని ప్రియాంక తెలిపారు. 2015లో తాను పర్పుల్ పెబుల్ పిక్చర్స్‌ను స్థాపించడానికి బాలీవుడ్ పరిస్థితులే కారణమన్నారు. 2000 సంవత్సరం మిస్ వరల్డ్ కిరీటం గెలుచుకున్న తర్వాత ఇండస్ట్రీలో ఆఫర్లు వచ్చాయి. హిందీ, తమిళ సినిమాల్లో నటించడం మొదలుపెట్టా. ఆ తర్వాత రెండేళ్లకు బాలీవుడ్ పరిస్థితులు అర్థమయ్యాయి. సినీనేపథ్యం లేకుండా ఇండస్ట్రీక్రి వచ్చినవారిని ఎంత చులకనగా చూస్తారో తెలుసుకొన్నాను. ప్రియాంక నిర్మాణసంస్థలో 2016లో సంతోశ్ మిశ్రా దర్శకత్వంలో వచ్చిన భోజ్‌పురి మొదటి సినిమాగా విడుదలైంది. ఆ తర్వాత ఆమె నటించిన పలు చిత్రాలు విడుదలై విజయాన్ని అందుకున్నాయి. ఇక ప్రియాంక సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా ఇది రూపొందుతోంది.

# దుల్కర్ మూవీలో పూజాహెగ్డే

తాజాగా రమ్యకృష్ణ నటిస్తున్నట్లు ప్రకటన మాలీవుడ్ స్టార్ యాక్టర్ దుల్కర్ సల్మాన్ ఇటీవలే కొత్త తెలుగు సినిమాను ప్రకటించాడని తెలిసిందే. దక్యూ41 వర్కింగ్ –టైటిల్‌తో వస్తోన్న ఈ సినిమాను టాలీవుడ్ లీడిరగ్ బ్యానర్ ఎస్ఎల్‌వీ సినిమాస్ తెరకెక్కిస్తోంది. ఈ చిత్రంలో పొడుగుకాళ్ల సుందరి పూజాహెగ్డే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుందని ఇటీవలే ప్రకటించారు. కాగా మేకర్స్ ఇప్పుడు మరో క్రేజీ అనౌన్స్‌మెంట్ చేశారు. మరో స్టార్ రమ్యకృష్ణ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తోంది. రమ్యకృష్ణకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ ఈ విషయాన్ని ప్రకటించారు. బాహుబలి ఫ్రాంచైజీలో శివగామి లాంటి పవర్ ఫుల్ రోల్‌తో గ్లోబల్ బాక్సాఫీస్‌ను షేక్ చేసింది రమ్యకృష్ణ. ఇంతకీ రమ్యకృష్ణ ఈ ప్రాజెక్టులో ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నారన్నది మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది. ఈ మూవీతో రవి నేలకుడిటి డైరెక్టర్‌గా పరిచయమవుతున్నాడు. ప్రస్తుతం ఉ41 షూటింగ్ దశలో ఉంది. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్ ఇటీ–వలే విడుదలైన లోక చాప్టర్ 1 బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపిస్తోంది. కాగా ఈ బ్యానర్‌లో ప్రస్తుతం నాని నటిస్తోన్న ది ప్యారడైస్ కూడా ఉంది.



# అసత్య ప్రచారం చేయడమే వారికి ఆనందం

### జగపతి బాబు టాక్‌షోలో నటి మీనా ఆవేదన



చైల్డ్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీలోకి వచ్చిన మీనా అగ్ర కథానాయకుల సరసన నటించి స్టార్‌గా ఎదిగారు. తాజాగా జగపతిబాబుతో ఆమె 'జయమ్ము నిశ్చయమ్మురా' కార్యక్రమానికి అతిథిగా హాజరై తన కెరీర్, పర్సనల్ లైఫ్ గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. స్టార్ హీరోలతో నటించిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కృష్ణ, రజనీకాంత్ ఇద్దరికీ తాను కూతురుగా, హీరోయిన్‌గా నటించినట్లు– చెప్పారు. నటుడు జగపతి బాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఈ టాక్ షో 'జీ 5' లో స్ట్రీమింగ్ అవుతోంది. ఇక తాను భర్తను కోల్పోయినప్పుడు సోషల్ మీడియాలో తనపై వచ్చిన న్యూస్‌పై మీనా అసహనం వ్యక్తంచేశారు. నా భర్త చనిపోయిన వారం తర్వాత నేను రెండో పెళ్లి చేసుకుంటున్నట్లు– రాశారు. వాళ్లకు కుటుంబాలు ఉండవా.. ఇలా రాస్తున్నారు. అని చాలా బాధపడ్డాను. ఆ తర్వాత ఎవరు విడాకులు తీసుకొన్నా నాతో పెళ్లి అని రాసేవారు. అలాంటి వార్తల వల్ల నాకు అసహ్యం వేసేదని తెలిపారు. 1986లో చైల్డ్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీలోకి వచ్చిన మీనా తమిళంతో పాటు– తెలుగులోనూ అగ్ర హీరోల సరసన నటించారు. రజనీకాంత్, చిరంజీవి, వెంకటేశ్, నాగార్జున, బాలకృష్ణ అందరితోనూ హిట్ సినిమాల్లో అలరించారు. కెరీర్‌లో మంచి అవకాశాలు వస్తున్నప్పుడే 2009లో విద్యాసాగర్‌ను వివాహం చేసుకున్నారు. ఆయన 2022లో అనారోగ్యం కారణంగా తుదిశ్వాస విడిచారు. ప్రస్తుతం మీనా 'మూకుతి అమ్మన్ 2'లో నటిస్తున్నారు. చాలామంది నిర్మాతలు ఫ్లాప్‌లలో ఉన్నామని తక్కువ అమౌంట్‌తో సినిమా చేస్తున్నామని నన్ను సంప్రదించేవారు. నేను సరేనని అంగీకరించేదాన్ని. ఆ చిత్రాలు సూపర్‌హిట్ అయ్యేవి. తర్వాత నన్ను మర్చిపోయేవారు. ఎప్పుడూ ఇలానే జరిగేది. కెరీర్‌లో వరుస అవకాశాలు వస్తున్నప్పుడే పెళ్లి చేసుకున్నాను. ఆ తర్వాత పాప పుట్టిన రెండేళ్లకు మలయాళం సినిమా దృశ్యం కోసం నన్ను సంప్రదించారు. పాపను వదిలి వెళ్లలేక తిరస్కరించాను. వాళ్లు రిక్వెస్ట్ చేశారు. కథ రాసేటప్పుడు నన్ను దృష్టిలోపెట్టుకున్నట్లు– తెలిపారు. వేరే వారితో సినిమా చేయలేమన్నారు. దీంతో అంగీకరించాను. జగపతిబాబు నాకు ఎప్పుడూ పోటీనే.. మీ పక్కన నేను వస్తుంటే నన్ను ఎవరూ చూసేవారు కాదు. అందరూ మిమ్మల్నే చూసేవారు' అంటూ మీనా సరదా సంగతులు పంచుకున్నారు. దివంగత నటి సౌందర్యతో తన అనుబంధాన్ని పంచుకొని మీనా ఎమోషనల్ అయ్యారు. ఆరోజు ఎన్నికల ప్రచారానికి సౌందర్యతో పాటు– తాను వెళ్లాల్సిఉందని కాకపోతే షూటింగ్ కారణంగా కుదరక వెళ్లలేదన్నారు.




# నంవబర్ 7న జటాధర విడుదల


### సోషల్ మీడియా ద్వారా ప్రకటన

సక్సెస్, ఫెయిల్యూర్స్‌తో సంబంధం లేకుండా సినిమాలు చేసుకుంటూ వెళ్తున్న యాక్టర్లలో ఒకడు సుధీర్ బాబు. ఈ టాలెంటె–డ్ యాక్టర్ ఈ సారి రూటు మార్చి సరికొత్త ప్రయోగంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. సుధీర్ బాబు నటిస్తోన్న సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ జటాధర వెంకట్ కల్యాణ్ కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్ తెలుగు, హిందీ బైలింగ్యువల్ సినిమాగా వస్తోంది. కాగా మేకర్స్ ఎన్నో రోజులుగా విడుదలపై నెలకొన్న డైలామాకు తెరదించారు. ఈ మూవీని నవంబర్ 7న తెలుగు, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ కూడా త్వరలో మొదలు కానున్నట్టు– ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. ఓ వైపు శివుడు మరోవైపు చేతిలో త్రిశూలాన్ని పట్టు–కున్న సుధీర్‌బాబు, ఇంకోవైపు ఉగ్రరూపంలో కనిపిస్తున్న సోనాక్షి సిన్హా లుక్స్‌ను మేకర్స్ ఇప్పటికే విడుదల చేయగా.. సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తున్నాయి. ఈ మూవీలో బాలీవుడ్ భామ సోనాక్షి సిన్హా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శిల్పా శిరోద్కర్ కీలక పాత్ర పోషిస్తోంది. సుధీర్ బాబు నటించిన హరోం హర, మా నాన్న సూపర్ హీరో సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయని తెలిసిందే. దీంతో తన ఆశలన్నీ జటాధర సినిమాపైనే పెట్టు–కున్నాడు. మరి ఈ సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ సుధీర్‌బాబుకు ఎంతలా కలిసొస్తుందో చూడాలి.

# 11 దాటినా.. పత్తా లేని అధికారులు

- గ్రీవెన్స్ రోజున ఖాళీ కుర్చీలే దర్శనం
- మల్హర్ తహసీల్దార్ కార్యాలయంలో ఇష్టారాజ్యం


**వరంగల్ వాయిస్, మల్హర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మల్హర్ తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది సమయపాలన పాటించకపోవడంపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రీవెన్స్ రోజున కూడా అధికారులు అందుబాటులో ఉండకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం గ్రీవెన్స్ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, ఉదయం 11 గంటలు దాటినా ఒక్క అధికారి కూడా కార్యాలయానికి రాకపోవడంపై పెదవి విరుస్తున్నారు. దీంతో తమ సమస్యలను చెప్పుకోవడానికి వచ్చిన ప్రజలు గంటల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. దీంతో సామాజిక కార్యకర్త ఒకరు కార్యాలయంలోని ఖాళీ కుర్చీలను ఫొటోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో అధికారులు తేరుకున్నారు. ఒక్కొక్కరుగా కార్యాలయానికి చేరుకున్నారు.



### అధికారుల ఇష్టారాజ్యం..

జిల్లా కేంద్రం భూపాలపల్లి నుంచి మల్హర్ మండల కేంద్రం తాడిచెర్లకు 60 కిలోమీటర్ల దూరం ఉండటం, సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని కార్యాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, ఏ పని కావాలన్నా రోజుల తరబడి తిప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ల విషయంలో స్లాట్ బుక్ చేసిన సమయానికి పనులు జరగడం లేదని, విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు కూడా సకాలంలో ఇవ్వడం లేదని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని కొయ్యూరు, వల్లెంకుంట, రుద్రారం వంటి పలు గ్రామాల నుంచి ప్రజలు వ్యయప్రయాసలకు ఓర్చి కార్యాలయానికి వస్తున్నా, పనులు జరగకపోవడంతో నిరాశ చెందుతున్నారు. ఈ పరిస్థితిపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, తహసీల్దార్ కార్యాలయంలో పనులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.





# జర్నలిస్టుల నిరసన

**ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ పై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఖమ్మం ఉమ్మడి జిల్లా టీ న్యూస్ స్టాఫ్ రిపోర్టర్ సాంబశివరావుపై పెట్టిన అక్రమ కేసును నిరసిస్తూ టీయూడబ్ల్యూజే (హెచ్ 143) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వరంగల్, హనుమకొండ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (హెచ్ 143) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్ మాట్లాడుతూ రైతులు ఎదురుకొంటున్న యూరియా సమస్యను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకురావడమే లక్ష్యంగా ఖమ్మం టీ న్యూస్ ప్రతినిధి సాంబశివరావు న్యూస్ కవరేజ్ చేయగా, పోలీసులు నిరంకుశంగా నాన్ బెయిలబుల్ కేసులు పెట్టడం శోచనీయమని ఆరోపించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే జర్నలిస్ట్ సాంబశివరావుపై పోలీసులు అక్రమ కేసు పెట్టారన్నారు. వెంటనే అక్రమ కేసులను ఎత్తివేయాలని లెనిన్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి అర్షం రాజ్ కుమార్, జిల్లా కమిటీ నాయకులు వేణు, రవికాంత్, సత్యనారాయణ, ఆదర్శ్, రాజేందర్, గొట్టే వెంకన్న, ప్రశాంత్, కృష్ణ, రఘు, సంజీవ్, రఘు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

### అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన..

న్యూస్ బ్యూరో సాంబశివరావుపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని టీయూడబ్ల్యూజే (హెచ్ 143) వరంగల్ జిల్లా అధ్యక్షుడు కోరుకొప్పుల నరేందర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం వరంగల్ జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో వరంగల్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కోరుకొప్పుల నరేందర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సింది పోయి అక్రమ కేసులు పెట్టి బెదిరింపులకు గురి చేయడం దురదృష్టకరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు మిట్ట నవనీత్, జిల్లా ప్రధాన కార్యదర్శి వాంకె శ్రీనివాస్, కోశాధికారి రాపల్లి ఉపేందర్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి నీలం శివ, కమటం వేణు గోపాల్, భూసారపు వెంకన్న, వనం భాస్కర్, అమీర్, వేశాల పూర్ణచందర్, రాయల ప్రభాకర్, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

# మాజీ డీఈఓపై విచారణ జరిపించండి

- కలెక్టర్ కు ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుల ఫిర్యాదు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మాజీ ఇంచార్జి డీఈఓ జ్ఞానేశ్వర్ అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుర్తి విజయ్ కుమార్, గడ్డం సుభద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్ లో వరంగల్ కలెక్టర్ సత్య శారదకి వినతిపత్రం అందజేశారు. జ్ఞానేశ్వర్ పై ఇప్పటికే పలు ఉపాధ్యాయ సంఘాలు, మానవ హక్కుల సంస్థలు, బాధిత ఉపాధ్యాయులు తీవ్ర ఆరోపణలు గుప్పించారన్నారు. సస్పెన్షన్ కేసుల్లో లైన్ క్లియరెన్స్ కోసం లక్షల రూపాయలు వసూలు చేశారని ఆరోపించారు. డీఏ ఎరియర్స్, డీఎస్సీ పోస్టింగ్స్, ఉపాధ్యాయుల బదిలీల్లో భారీ అవినీతి, ఆరోపణలు మూటగట్టుకున్నారన్నారు. డీఎస్సీ–2024 పోస్టింగ్స్ లో ఒకే పాఠశాలలో ఎక్కువ ఖాళీలు చూపించి, లంచాలు తీసుకొని పోస్టింగ్స్ ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. కార్యాలయ సిబ్బందిపై వేధింపులు, హాజరు రిజిష్టర్లలో అక్రమ ఎంట్రీలు, హెడ్ మాస్టర్లకు బెదిరింపులు, వాట్సాప్‌లో తప్పుడు మెసేజీలు పెట్టడం వంటి అనుచిత ప్రవర్తనలకు పాల్పడినట్లు జ్ఞానేశ్వర్ పై ఆరోపణలు ఉన్నాయన్నారు. జ్ఞానేశ్వర్ పై ఏసీబీ లేదా ఈడీ విచారణ జరిపించి అక్రమంగా సంపాదించిన ఆస్తులను స్వాధీనం చేసుకోవాలన్నారు. శాఖాపరమైన చర్యలు తీసుకొని, వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని గడ్డం సుభద్ర, పాలకుర్తి విజయ్ కుమార్ కోరారు.

# 17 న ప్రైవేట్ ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ట్రస్మా వడుప్స వరంగల్ జిల్లా గౌరవాధ్యక్షులు ఆడేపు శ్యామ్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం శివనగర్ లోని వందన హైస్కూల్ లో వడుప్స జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈనెల 17వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు వరంగల్ రంగశాయిపేటలోని బిర్లా ఓపెన్ మైండ్ స్కూల్ లో ట్రస్మా వడుప్సా వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో వడుప్స ప్రైవేటు పాఠశాలలో ఒక్కో స్కూల్ నుంచి ప్రైమరీ సెక్షన్ ఒకరూ, హై స్కూల్ సెక్షన్ నుంచి ఒకరిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నుకొని వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సన్మాన కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా వరంగల్ ఆర్జేడీ ముఖ్య అతిథులుగా వరంగల్ డీఈఓ, ఎంఈఓలు, ట్రస్మా రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. వడుప్సా సభ్యత్వం కలిగినటువంటి ప్రతి ఒక్క పాఠశాల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమయానికి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వడుప్సా వరంగల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఏవీఎస్ వీరస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బిళ్ల రవి, కోశాధికారి ఠాగూర్ జ్ఞానేశ్వర్ సింగ్, సలహాదారులు కొడెం శ్రీధర్, పొన్నోజు చక్రపాణి, వరంగల్ జోన్ అధ్యక్షులు కూచన క్రాంతి కుమార్, ఖిలా వరంగల్ జోన్ అధ్యక్షులు ముక్కెర రవీందర్, జిల్లా నాయకులు ఎ.సతీష్ కుమార్, ఎ.వెంకటేశ్వర్లు, ఎం.రాజు, జోన్ కార్యదర్శులు వి.శ్రీనివాస్, డి.సతీష్ మూర్తి, జోన్ కోశాధికారులు కూరపాటి మోహన్, గోపు ప్రవీణ్ కుమార్, జోన్ ప్రతినిధులు కె.రవి, శరత్ బాబు తదితర కరస్పాండెంట్స్ పాల్గొన్నారు.

# 17 న జిల్లా స్థాయి నేషనల్ సైన్స్ సెమినార్

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్, టెక్నాలజికల్ మ్యూజియం బెంగళూరు ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ సెమినార్ –2025లో పాల్గొనేందుకు హనుమకొండ జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు జిల్లా స్థాయిలో సైన్స్ సెమినార్ ను ఈ నెల 17న నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాస స్వామి తెలిపారు. హనుమకొండలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల లస్కర్ బజార్ ప్రాంగణంలోని జిల్లా సైన్స్ కేంద్రంలో 'క్వాంటం ఏజ్ బిగిన్స్ పొటెన్షియల్స్ అండ్ ఛాలెంజెస్'అనే అంశంపై ఉదయం 9.30 గంటలకు నిర్వహించబోయే రాత పరీక్షకు హాజరు కావాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని మండలానికి ఒకరికి చొప్పున సెమినార్ లో పాల్గొనుటకు అనుమతించబడుతుందన్నారు. ముందుగా నిర్వహించే రాత పరీక్ష ఆన్లైన్ లో ఉంటుందన్నారు. విద్యార్థులు, గైడ్ టీచర్లు తమ వెంట మొబైల్ ఫోను తీసుకొని రావలసిందిగా సూచించారు. విద్యార్థుల సెమినార్ ప్రదర్శనకు ఆరు నిమిషాల వ్యవధిని కేటాయించగా మౌఖిక ప్రశ్నలకు రెండు నిమిషాల సమయం ఉంటుందన్నారు. సెమినార్ ప్రదర్శనలో భాగంగా విద్యార్థులు తమ వెంట గరిష్టంగా 5 చార్టులు లేదా 5 స్లైడులతో కూడిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తీసుకొని రావచ్చని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని ఈనెల 18వ తేదీన హైదరాబాద్ లోని ఎస్సీఈఆర్టీ నందు నిర్వహించే రాష్ట్ర స్థాయి సెమినార్ లో పాల్గొనుటకు అర్హత పొందుతారని జిల్లా సైన్స్ అధికారి తెలియజేశారు.




# మత్తు మహమ్మారిని తరిమికొట్టాలి

- కమ్యూనిటీ నార్కోటిక్ ఇన్ స్పెక్టర్ శ్రీకాంత్

**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** మత్తు మహమ్మారిని తరిమికొట్టడమే యువత లక్ష్యం కావాలని కమ్యూనిటీ నార్కోటిక్ ఇన్ స్పెక్టర్ శ్రీకాంత్ అన్నారు. సోమవారం మడికొండలోని రామన్ హైస్కూల్ లో మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కమ్యూనిటి నార్కోటిక్ ఇన్ స్పెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు, వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఎక్కడైనా మత్తు పదార్థాల వాడకాన్ని గమనిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1908, హెల్ప్ లైన్ నెంబర్ 14446 కు సమాచారం అందించాలని సూచించారు. కమ్యూనిటీ ఎడ్యుకేటర్ అలువాల తేజస్వి గుడ్ టచ్–బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ తోపాటు పోలీస్ సిబ్బంది, పాఠశాల వైస్ ప్రిన్సిపల్, ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE. EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com